క్లుప్తంగా

పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



పర్వతగిరి : పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మామునూరు ఏసీపీ తిరుపతి కోరారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పోలీసు అధికారులతో సమావేశమై మాట్లాడారు. పిటీషనర్లకు ఇబ్బంది కలుగకుండా సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. పిటీషనర్ల వెంట పెద్దమనుషులు రాకూడదని, గుంపులుగా పోలీస్‌స్టేషన్‌కు అనుమతించొద్దని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్, ఏఎస్సై రవీందర్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం



నర్సంపేట : మహిళల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ సహాయ తెలిపారు. పట్టణంలోని ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత మగ్గం, టైలరింగ్ శిక్షణను బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు శిక్షణను వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. నైపుణ్యం పెంచుకుంటే రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రతిభ సంస్థ అధ్యక్షుడు గిరిగాని సుదర్శన్, ఎఫ్‌ఎంఎం సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బత్తుల కరుణ, విజిలెన్స్ కమిటీ సభ్యులు నాగెల్లి సారంగం, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ మగ్గం ట్రైనర్ నాడెం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేయాలని రాస్తారోకో

వర్ధన్నపేట : మండలంలోని వెంకటేశ్వరపల్లి తండావాసులు, రైతులు తండాకు, పంట పొలాలకు బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎమ్మెల్యే నాగరాజు 5వ వార్డు బీటీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభానికి వచ్చారని తెలుసుకున్న గిరిజనులు, రైతులు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌లో ఎమ్మెల్యే నాగరాజు కాన్వాయ్ నిలిచి పోవడతో పోలీసులు గిరిజనులను, రైతులను బలవంతంగా రోడ్డు నుంచి తప్పించారు. అనంతరం ఆందోళన చేపట్టిన గిరిజనులు, రైతులు మీడియాతో మాట్లాడారు. రహదారి బురదమయం కావడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోయారు.

దాడులు సరికాదు

రాయపర్తి : ఆర్‌ఎంపీలపై దాడులు సరికాదని గ్రామీణ ఆదర్శ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు నయీమ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని చెప్పారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాకపోవడంతో డాక్టర్ల వద్ద శిక్షణ పొంది ఆర్‌ఎంపీలుగా గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆర్‌ఎంపీలకు ఉపాధి కల్పించాలని, దాడులు మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి అఫ్సర్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, వైద్యులు బండ యాదగిరి, సభ్యులు శ్రీనివాస్, యాకయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించాలి



నర్సంపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ రేణుకకు బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. అంబేడ్కర్ అభయహస్తం కింద పేద కుటుంబాలకు రూ.12 లక్షల సాయం అందజేయాలని, ఎస్సీ ఉపకులాలకు, తదితర డిమాండ్లు చేశారు.

వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు చేవెళ్లలో ప్రకటించిన డిక్లరేషన్‌కు అనుగుణంగా ఎస్సీలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ అనుబంధ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఐత రవి ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వినయేందర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రవి మాట్లాడారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

● నిండుతున్న చెరువులు

నర్సంపేట : జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువుల్లో జలకళ నెలకొంది. ఖరీఫ్ పంటల సాగుకు సాగునీరు సంపూర్ణంగా అందనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 3 లక్షల ఎకరాల విస్తీర్ణం వరి, మొక్కజొన్న, పత్తి, కంది, వేరుశనగ, ఇతర పంటలు సాగవుతున్నాయి. వర్షాకాల ప్రారంభంలో అరకొర కురిసిన వర్షాలు ఆగస్టు ప్రారంభంలో కురుస్తున్న వర్షాలతో జిల్లాలో ప్రధాన నీటి వనరులై పాకాల సరస్సు మత్తడికి చేరుకుంది. పాకాల కింద అధికారికంగా 35 వేల ఎకరాల వరి సాగవుతుంది. మాదన్నపేట చెరువు బుధవారం మత్తడి పోస్తోంది. ఆ చెరువు కింద 3,500 ఎకరాల వరి సాగు నీరందనుంది. కటాక్షపురం, రంగాయ చెరువులతోపాటు కుంటలు పూర్తి స్థాయిలో నిండాయి.

రంగయ్య చెరువులో జలకళ

నల్లబెల్లి : మండలంలోని గోవిందాపురం రంగాయ చెరువులో జలకళ సంతరించుకుంది. చెరువు అలుగుపోసింది. వర్షాలకు పైనుంచి వరదనీరు చేరుతుండగా పూర్తిస్థాయి నీటిమట్టం 17.5 ఫీట్లు కాగా అక్కడి వరకు చేరి మత్తడి దూకుతోంది. ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బుధవారం నమోదైన వర్షపాతం(మి.మీ)	
ఖానాపురం	35.4
నెక్కొండ	10.0
పర్వతగిరి	10.2
నర్సంపేట	14.4
చెన్నారావుపేట	15.4
సంగెం	6.4
గీసుగొండ	12.6
దుగ్గొండి	13.6
రాయపర్తి	4.4
వర్ధన్నపేట	4.8
ఖిలా వరంగల్	14.0
వరంగల్	19.6
నల్లబెల్లి	8.0



నర్సంపేట : మత్తడి పోస్తున్న మాదన్నపేట చెరువు

భక్తిశ్రద్ధలతో బోనాలు



నర్సంపేట : పూజలు చేస్తున్న భక్తులు



పర్వతగిరి : బోనాలతో వస్తున్న మహిళలు

నర్సంపేట : శ్రావణ మాసం సందర్భంగా నర్సంపేటలోని 10వ వార్డులో ప్రజలు పోచమ్మతల్లికి బుధవారం బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తీసుకొచ్చిన బోనాలను పోచమ్మతల్లికి సమర్పించారు.

పర్వతగిరి : మండలంలోని పర్వతగిరి, తదితర గ్రామాల్లో పోచమ్మకు బోనాలు సమర్పించారు. ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది కరుణాకర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని రాయపర్తి, పెర్కవేడు, రాగన్నగూడెం, వెంకటేశ్వరపల్లి తదితర గ్రామాల్లో ముత్యాలమ్మ, మారెమ్మలకు బోనాలు సమర్పించారు. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామదేవతలకు ప్రజలు మొక్కులు చెల్లించారు.

చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు పోచమ్మతల్లి బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలు తీసుకుని డప్పుచప్పుళ్ల నడుమ ఆలయాలకు తరలివెళ్లి మొక్కులు చెల్లించారు.

నెక్కొండ : మండల కేంద్రంలో మహిళలు ఊరేగింపుగా బోనాలు ఎత్తుకొని పోచమ్మ గుడికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గుడి వద్ద భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈఓ సదానందం ఏర్పాట్లు చేశారు.

ఖానాపురం : మండలంలోని కొత్తూరులో పోచమ్మ బోనాల పండుగ జరుపుకున్నారు. మహిళలు బోనాలతో వెళ్లి మొక్కులు చెల్లించారు.

అవగాహనతోనే మాతాశిశు సంరక్షణ



నర్సంపేట : కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపాల్

నర్సంపేట : అవగాహన పెంపొందించుకోవడం ద్వారానే మాతాశిశు సంరక్షణ సాధ్యమని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ గోపాల్ తెలిపారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా ఆస్పత్రిని బుధవారం ఆయన సందర్శించి సీడీపీఓ మధురిమ ఆధ్వర్యంలో 25 మంది బాలింతలకు పండ్లు, 25 మంది పిల్లలకు దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. తల్లులకు అవగాహన కల్పించడంలో ఐసీడీఎస్, వైద్యశాఖ సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో ఆర్పీలకు, ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ హేమలత, కౌన్సిలర్లు అంజలి, కీర్తిరెడ్డి, ఎలకంటి విజయ్‌కుమార్, శీలం రాంబాబు, టీఎస్‌ఎఫ్ అధ్యక్షురాలు ఆడెపు రమాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ మార్త, ఏఎన్‌ఎం కవిత, శ్రీరామోజు మురళీ, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఫార్మసీ విద్యార్థుల ఆధ్వర్యంలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు జిల్లా ఆస్పత్రిలోని బాలింతలకు పండ్లు, పిల్లలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సిద్దార్థ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పుట్ట రవి పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయనిపహాడ్ సెక్టార్ పరిధిలోని నడిమితండా సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అరుణ మాట్లాడారు. తల్లి పాలు పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచుతాయని చెప్పారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందుతున్న పౌష్టికాహారాన్ని తల్లులు, పిల్లలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కవిత, పుష్పలత, ఇందిర, స్వర్ణలత, సుజాత, కవిత, సుగుణ, మేరీ రాజ్యం, అమ్మాజీ ఆయమ్మ అనూశ, ఆశా కార్యకర్తలు సాలమ్మ, లలిత పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలో ర్యాలీ నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలని, తదితర నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బోదె అరుణాదేవి, సోమ స్వరూప, ఏఎన్‌ఎం సరిత, ఆశా కార్యకర్తలు రమ, శారద, విజయ పాల్గొన్నారు.

ఆయకట్టు రోడ్డు అధ్వానం



ఖానాపురం : మండలంలోని రంగాపురం శివారులోని ఆయకట్టు రోడ్డు అధ్వానంగా మారి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చెన్నారావుపేట, ఖానాపురం మండలంలోని రంగాపురం గ్రామాలకు చెందిన రైతులకు రంగాపురం శివారులో పంట పొలాలు ఉన్నాయి. ఆ రెండు గ్రామాల రైతులు పంట పొలాలకు వెళ్లడానికి ఈ రోడ్డు మీదుగానే వెళ్లాల్సిన పరిస్థితి. కాగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. రైతులు నడవడానికి, ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది తప్పని దుస్థితి నెలకొంది. ట్రాక్టర్లు మాత్రమే వెళ్లే పరిస్థితి చోటు చేసుకుంది. దీంతో రెండు మండలాలకు చెందిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆయకట్టు రోడ్డుపై మొరం పోయించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

అనారోగ్యంతో వివాహిత మృతి



కావేరి(ఫైల్)

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లికి చెందిన తూర్పాటి కావేరి (25) అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమె గర్భవతి కాగా బాబు జన్మించి మంగళవారం మృతి చెందాడు. అనంతరం కావేరి మృతి చెందింది.

ఎన్నికల హామీల అమలుకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. పట్టణంలోని 5వ వార్డులో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణాన్ని, కోనారెడ్డి చెరువుకు వచ్చే ఫీడర్ ఛానల్ కోనాయ చలిమ వద్ద నుంచి 12 కిలోమీటర్ల మేర మట్టి, పిచ్చిమొక్కలు తొలగించే పనులను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పనులను చేపట్టి ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, సమ్మెట సుధీర్, భూక్యా అనిత, నాయకులు కమ్మగోని ప్రభాకర్, పోశాల వెంకన్న, అఫ్సర్, అన్వర్, మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం ప్రారంభం



ఆలయాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లిలో తన సొంత డబ్బు వెచ్చించి నిర్మించిన ముత్యాలమ్మ ఆలయాన్ని ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. తొలుత ఆయనకు గ్రామస్తులు డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. గ్రామస్తుల కోరిక మేరకు ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు.

విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేత

మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ.50 వేల విలువైన క్రీడాదుస్తులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువులతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తోడ్పాటు అందించేలా యూనిఫారాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని హెచ్‌ఎం గారె కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు లేతాకుల మధూకర్‌రెడ్డి, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



గీసుకొండ : మొక్క నాటుతున్న సీఈఓ రాంరెడ్డి

గీసుకొండ : సమాజంలోని ప్రతీఒక్కరు మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి కోరారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఊకల్, మరియపురంల్లో బుధవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కమలాకర్, ఎస్సై కుమార్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, సరిత తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం, అమీనాబాద్ మోడల్ స్కూళ్లలో, గ్రామాల్లో నర్సంపేట రూరల్ సీఐ చంద్రమోహన్, మండల ప్రత్యేక అధికారి బాలాజీ మొక్కలు నాటారు. విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎస్సై గూడ అరుణ్, ఎంపీఓ శ్రీధర్ రాజు, హెచ్‌ఎం రవీందర్, వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని పాకాలలో రూరల్ సీఐ రాజగోపాల్ మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై రఘుపతి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు విధుల బహిష్కరణ.. ర్యాలీ



జనగామ: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జనగామ : ఓ కేసు విషయమై మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులు అమృతరావు, కవితలపై పోలీసులు దాడి చేశారని నిరసిస్తూ జనగామ కోర్టులో రెండోరోజు బుధవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి ఆధ్వర్యాన అడ్వొకేట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వరంగల్, భూపాలపల్లి, పరకాల, సిద్దిపేట, రంగారెడ్డి, సూర్యాపేట, హైదరాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాలకు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వచ్చారు. ప్రముఖులు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో ఉదయం, మధ్యాహ్నం చర్చలు జరిపారు. సీఐతోపాటు దాడిలో పాల్గొన్న ఎస్సై, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. చర్చలు విఫలం కావడంతో కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించగా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

న్యాయవాదుల ఫిర్యాదుపై కేసు నమోదు

పోలీసులు, న్యాయవాదుల మధ్య జరిగిన వివాదంలో న్యాయవాదులు ఇచ్చిన ఫిర్యాదుపై జనగామ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులపై కేసు నమోదు చేయడంతోపాటు శాఖాపరమైన విచారణ ప్రారంభించారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మను విచారణ అధికారిగా నియమించినట్లు వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు.

దాడులు సరికాదు

నర్సంపేట రూరల్ : న్యాయవాదులపై దాడులు సరికాదని సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ అన్నారు. నర్సంపేటలోని కోర్టు హాల్‌లో న్యాయవాదులు నల్లాబ్యాడ్జీలు ధరించి కోర్టు విధులు బహిష్కరించి బుధవారం నిరసన తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. జనగామ జిల్లా పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదులపై జరిగిన దాడి ఖండించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సారంగపాణి, రమేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి

నర్సంపేట : చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని పద్మశాలి సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు రుద్ర ఓంప్రకాశ్ కోరారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పద్మశాలీ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత మార్కండేయ చిత్రపటానికి ఓంప్రకాశ్, నాయకులు పూలమాల వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఓంప్రకాశ్ మాట్లాడారు. చేనేత కార్మికులకు నూలుపై రాయితీ ఇవ్వాలని, చేనేత కుటుంబాలకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు కోదాటి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి కూచన శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీరాముల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు




నర్సంపేట : నర్సంపేటలోని శ్రీభూనీల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం అర్చకులు ముడుంబై రామానుజాచార్యులు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మ వారికి ఆరగింపు, తీర్థ ప్రసాద వితరణ చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



సంగెం : మండలంలోని నల్లబెల్లి శివారు కొత్తపల్లిలో గోనె మహేందర్ ఇంటి వద్ద 104 బస్తాల్లో నిల్వ ఉంచిన 52 క్వింటాళ్ల, ముస్కు రాజు ఇంటి వద్ద 70 బస్తాల్లో నిల్వ ఉంచిన 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మొత్తం పట్టుకున్న బియ్యం విలువ రూ.1.39 లక్షలు ఉంటుందని ఎస్సై వెల్లడించారు. చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన గుళ్లపల్లి విజేందర్ అనే డీసీఎం డ్రైవర్ అదే గ్రామానికి చెందిన రేషన్ డీలరు కోత్వాల వెంకటేశ్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల వినియోగదారుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు కోళ్ల ఫారాలకు అమ్ముకునేందుకు నిల్వ ఉంచినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యుగంధర్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం



పర్వతగిరి : మండలంలోని తూర్పుతండాకు చెందిన బానోతు యుగంధర్‌కు రాష్ట్రస్థాయి ప్రకృతి సేవా పురస్కారం లభించింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న, మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మొక్కల వెంకటయ్య, డాక్టర్ నర్మద, వేణు, సతీష్‌కుమార్, సదాశివ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యుగంధర్‌కు అవార్డు అందించారు.

ఎల్‌ఓసీ అందజేత

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన మర్రి రమేశ్ కుమారుడు నవనీత్ అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లపెల్లి నర్సయ్య, మార్కెట్ డైరెక్టర్ కోరె కుమారస్వామి బుధవారం అందజేశారు.

సత్యాగ్రహ దీక్ష వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నర్సంపేట : ఈనెల 10న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్ష కార్యక్రమ వాల్‌పోస్టర్లను బీసీ కులాల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజు, జిల్లా నాయకులు మచ్చిక రాజుగౌడ్ పట్టణంలోని మాధన్నపేట రోడ్డులోని రామకృష్ణ ఆటో యూనియన్ అడ్డాలో నియోజకవర్గ నాయకుడు బాల్నె సుభాష్ అధ్యక్షతన బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

నల్లబెల్లి : మండలంలోని నందిగామలోని గుడుంబా స్థావరాలపై నల్లబెల్లి పోలీసులు, నర్సంపేట ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఇస్లావత్ రమ ఇంటి ఆవరణలో 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 50 లీటర్ల గుడుంబా, పట్టిక, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సతీష్ బాబు తెలిపారు. రమపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం

చెన్నారావుపేట : మండలంలోని సూర్యపేటతండాకు చెందిన ఆటోడ్రైవర్ జాటోతు రవి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి చెన్నారావుపేట ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వైద్యం కోసం..

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లికి చెందిన హేమలత–ప్రవీణ్ దంపతుల కుమారుడు యతిన్‌తేజ్ బ్రెయిన్ స్ట్రోక్ సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతడి వైద్యం కోసం తెలుసుకున్న గ్రామానికి చెందిన వ్యాపార, ఉద్యోగ అసోసియేషన్ సభ్యులు పులి దేవేందర్, అందె వెంకటేశ్వర్లు బుధవారం రూ.47 వేల సాయం అందజేశారు.

హామీ మేరకు పెన్షన్లు పెంచాలి



సంగెం : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను వితంతవులకు, ఇతరులకు రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య మండల అధ్యక్ష కార్యదర్శులు రౌతు రేణుక, ఇందిర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సమాఖ్య మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కల్పనకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రేణుక, ఇందిర మాట్లాడారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులను నిషేధించాలని, ప్రభుత్వ ఆస్పత్రులుల్లో సదుపాయాలు కల్పించి సరైన వైద్యం అందించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుని హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపురం : గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఉస్మాన్ బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం మండల పరిషత్ కార్యాలయంలో అధికారి అందుబాటులో లేకపోవడంతో కంప్యూటర్ ఆపరేటర్ గుణశ్రీకి ఒక రోజు సమ్మె నోటీసును బుధవారం అందజేసింది. అనంతరం ఉస్మాన్ మాట్లాడారు. పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం చెల్లించడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నివాళి

దుగ్గొండి : ఎంసీపీఐ(యూ) నాయకుడు గటిక వీరస్వామికి రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు, నాయకులు నివాళులర్పించారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని రేబల్లెలో వీరస్వామి 33వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడారు.

తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మించాలి



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిన క్రమంలో నూతన భవనం నిర్మించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించి భవనాన్ని పరిశీలించింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని తెలియని పరిస్థితుల్లో అధికారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు.